# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 02-06-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రపంచ విమాన రవాణా పరిశ్రమలో భారతదేశ విమానయాన రంగం కీలక పాత్ర పోషిస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు.
- ❖ రైతుల శ్రేయస్సుకు, దేశ ఆహార భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.
- ❖ ఉగ్రవాదంపై పోరాటంలో భారతదేశం, పరాగ్వే దేశాలు కలిసి ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు.
- ❖ దేశంలో ఎలక్ట్రిక్ కార్ల తయారీని ప్రోత్సహించే పథకం మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసిందని కేంద్రమంత్రి హెచ్.డి.కుమారస్వామి వెల్లడించారు.
- ❖ రానున్న ఐదు రోజుల్లో ఈశాన్య భారతదేశంలో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (IMD) తెలిపింది.

==========================

ప్రపంచ విమాన రవాణా పరిశ్రమలో భారతదేశ విమానయాన రంగం కీలక పాత్ర పోషిస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఈరోజు జరిగిన అంతర్జాతీయ వాయు రవాణా సంఘం (IATA) 81వ వార్షిక సర్వసభ్య సమావేశంలో ప్రధానమంత్రి పాల్గొని ప్రసంగించారు. గ్లోబల్ స్పేస్-ఏవియేషన్ కన్వర్జెన్స్‌లో భారత్ ఒక ప్రముఖ శక్తిగా ఎదుగుతోందన్నారు. ఉడాన్ పథకం విజయవంతమవడం భారత పౌర విమానయానంలో ఒక సువర్ణ అధ్యాయం అని, ఇప్పుడు భారత్ ప్రపంచంలోనే 3వ అతిపెద్ద దేశీయ విమానయాన మార్కెట్‌గా మారిందన్నారు. ప్రపంచ విమానయాన రంగంలో ఆవిష్కరణ, సమగ్ర అభివృద్ధికి భారత్ ఒక చిహ్నం అని ప్రధానమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

==========================

దేశంలో రాబోయే ఐదేళ్లలో మరో 50 విమానాశ్రయాలను అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్ మోహన్ నాయుడు స్పష్టం చేశారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఈరోజు జరిగిన అంతర్జాతీయ వాయు రవాణా సంఘం, IATA 81వ వార్షిక సర్వసభ్య సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ.... 2014లో దేశంలో కేవలం 74 విమానాశ్రయాలు మాత్రమే ఉండగా, ఇప్పుడు 162కి పెరిగాయని, వీటిలో 33 అంతర్జాతీయ విమానాశ్రయాలు ఉన్నాయన్నారు. ఏటా ఎనిమిది విమానాశ్రయాలు నిర్మించడంతో, విమానయాన మౌలిక సదుపాయాలు వేగంగా రెట్టింపు అవుతున్నాయని తెలిపారు. 2025 ఏప్రిల్ వరకు, దేశీయ విమాన ట్రాఫిక్ ప్రపంచ రేటు 8 శాతం కంటే 10 శాతం పెరిగిందని, ఈ వృద్ధికి ఉడాన్ పథకం కారణమని మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

==========================

రైతుల శ్రేయస్సుకు, దేశ ఆహార భద్రతకు కేంద్రప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. బీహార్ లోని మోతీహారి పట్టణంలో ఉన్న పిపారకోత్ కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ రోజు జరిగిన "వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్" కార్యక్రమంలో శివరాజ్ సింగ్ చౌహాన్ పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఈ అభియాన్ 5వ రోజుకు చేరుకుందని, లబ్ధిదారులకు వివిధ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ అందించడం ఈ ప్రచారం ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణుల సహాయంతో ప్రయోగ శాలల ఆలోచనలను, వ్యవసాయ క్షేత్రాల వరకు సజావుగా అమలు చేయడంపై ప్రత్యేక దృష్టిసారించామని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

==========================

ఉగ్రవాదంపై పోరాటంలో భారతదేశం, పరాగ్వే దేశాలు కలిసి ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. పరాగ్వే అధ్యక్షులు శాంటియాగో పెనా పలాసియోస్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మధ్య ఈరోజు న్యూఢిల్లీలో ప్రతినిధుల బృందం స్థాయి చర్చలు జరిగాయి. క్లీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, బయో ఇంధనం వంటి రంగాలలో తమ సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని ఈ చర్చల్లో రెండు దేశాలు నిర్ణయించాయి. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ.... డిజిటల్ టెక్నాలజీ, వ్యవసాయం, రక్షణ, రైల్వేలు, అంతరిక్షం వంటి రంగాలలో ఇరు దేశాలకు చాలా శక్తివంతమైన మార్గాలు ఉన్నాయన్నారు. దక్షిణ అమెరికాలో పరాగ్వే భారత్‌కు అత్యంత విలువైన భాగస్వామి అని నరేంద్రమోదీ పేర్కొంటూ...

(వాయిస్ 34 సెకన్లు)

విరామం

==========================

కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సభ్యులు శశి థరూర్ నేతృత్వంలోని అఖిల పక్ష ప్రతి నిధుల బృందం బ్రెజిల్ పర్యటన ముగించుకుని ఈ రోజు అమెరికాకు వెళ్లనుంది. కొలరాడోలోని బౌల్డర్‌లో ఈరోజు జరిగిన ఉగ్రదాడిపై శశి థరూర్ సామాజిక మధ్యమ వేదికగా ఆందోళన వ్యక్తం చేశారు. భారత్, అమెరికా దేశాల్లో ఉగ్రవాదానికి స్థానం లేదని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో అభిప్రాయంతో ఏకీభవిస్తున్నానని శశి థరూర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

==========================

దేశంలో ఎలక్ట్రిక్ ప్యాసింజర్ కార్ల తయారీని ప్రోత్సహించే పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసిందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి వెల్లడించారు. ఈరోజు న్యూఢిల్లీలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ .... పెద్ద అంతర్జాతీయ వాహన సంస్థలను ఆకర్షించడానికి భారతదేశం కనీసం 35 వేల డాలర్ల విలువైన ఎలక్ట్రిక్ కార్లపై 15 శాతం తక్కువ దిగుమతి పన్నును విధిస్తుందని తెలిపారు. దేశంలో ఎలక్ట్రిక్ వాహనాలపై పెట్టుబడి పెట్టడానికి, తయారు చేయడానికి కంపెనీలు అంగీకరిస్తేనే ఈ ప్రయోజనం లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ పథకం నిబంధనలకు అనుగుణంగా ఆమోదించబడిన దరఖాస్తుదారులు కనీసం 4 వేల 150 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టాల్సి ఉంటుందని కేంద్రమంత్రి కుమారస్వామి వివరించారు. ఇప్పటివరకు, మెర్సిడెస్-బెంజ్, కియా, హ్యుందాయ్, స్కోడా ఈ పథకంపై ఆసక్తి చూపాయని ఆయన తెలిపారు. టెస్లా సంస్థ భారత్ షోరూమ్‌లను ఏర్పాటు చేయడానికి మాత్రమే ఆసక్తి చూపిందని పేర్కొన్నారు. అలాగే సున్నా ఉద్గారాల లక్ష్య సాధనకు ఈ పథకం ఉపకరిస్తుందని కుమారస్వామి వివరిస్తూ....

(వాయిస్ 33 సెకన్లు)

==========================

ప్రాథమిక వ్యవసాయ రుణ సంఘాల (PACS) ఆదాయాన్ని పెంచడంతో పాటు గ్రామీణ ఉపాధి అవకాశాలను సృష్టించడం ఆహార ధాన్య నిల్వ పథకం లక్ష్యమని కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన ప్రపంచంలోనే అతిపెద్ద సహకార ఆహార ధాన్య నిల్వ పథకం సమీక్షా సమావేశానికి మంత్రి అమిత్ షా అధ్యక్షత వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'సహకార్ సే సమృద్ధి' దార్శనికతను సాకారం చేసుకునే దిశగా ఈ పథకం కీలక అడుగు అని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

==========================

భారతీయ సాంకేతిక విద్యాలయం (ఐఐటీ) కాన్పూర్.. ఈ రోజు JEE అడ్వాన్స్‌డ్ 2025 పరీక్షా ఫలితాలను 2025 ప్రకటించింది. మొదటి ర్యాంక్‌ను రజిత్ గుప్తా సాధించగా, రెండవ ర్యాంక్‌ను సాక్షమ్ జిందాల్ కైవసం చేసకున్నాడు. కాగా JEE అడ్వాన్స్‌డ్ పరీక్షను భారతీయ సాంకేతిక విద్యాలయాలలో ఇతర సాంకేతిక విద్యాసంస్థలలోనూ అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులలో ప్రవేశం కొరకు నిర్వహిస్తారు.

==========================

తెలంగాణ రాష్ట్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ మర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆ రాష్ట్ర ప్రజలకు ఈ రోజు సామాజిక మాధ్యమ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ విపులమైన సాంస్కృతిక వారసత్వం, ఆర్థిక, సాంకేతిక అభివృద్ధి కోసం ప్రోత్సాహకరమైన వాతావరణం కలిగి ఉందని, రాష్ట్ర ప్రజలు పురోగతి అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నారని రాష్ట్రపతి ద్రౌపదీ మర్ము ఆకాంక్షించారు. తెలంగాణా రాష్ట్రం ప్రగతి పథంలో ఉండాలని, రానున్న సంవత్సరాలలో ఎన్నో విజయాలను సాధించాలని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ పేర్కొన్నారు. జాతీయ పురోగతికి తెలంగాణ ఎంతో కృషి చేసిందని, గత దశాబ్దంలో రాష్ట్ర ప్రజల జీవన సౌలభ్యం పెంపొందించడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకున్నదని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు.

==========================

రానున్న ఐదు రోజుల్లో ఈశాన్య భారతదేశంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. తూర్పు, మధ్య భారతదేశం, ఉప-హిమాలయ పశ్చిమ బెంగాల్ సిక్కింలలో రాబోయే 7 రోజుల్లో ఈ ప్రాంతాలలో తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది.

==========================

ఈ నెల 15న జరగాల్సిన (నీట్) పీజీ 2025ను పరీక్షను వాయిదా వేస్తున్నామని నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ ఈ రోజు తెలిపింది. తదుపరి తేదీని త్వరలో తెలియజేస్తామని పేర్కొంది.

============================
============================